# గుసగుసలు

పి. వీరేశలింగం

ఏమండోయ్ సుందరమ్మగారూ మాట"

"ఏమండి యేదో పనిమీద వచ్చినట్టున్నారే" అంటూ కూర్చున్నదల్లా లేవబోయింది సుందరమ్మగారు.

"ఫరవాలేదు కూర్చోండి నాకూ ఏపనీలేదు. మీపనింతా తెమల్చేదా" అంటూ ప్రశ్నించింది పక్కింటి పార్వతమ్మగారు.

"ఇప్పుడే నాకూ పని పూర్తయింది. ఆయన అల్లా ఆఫీసుకు వెళ్ళేరు. కాస్త నడుం వాలుద్దామని కూర్చున్నాను."

"మీ పక్కవాటా ఎవరికో అద్దెకిచ్చినట్టున్నారే"

"అవునండి. పదిరోజుల క్రితం ఎవరో అమ్మాయి వచ్చి అడిగింది. చిన్నపిల్లేను. పదిహేడో పద్దెనిమిదో యేళ్ళుంటాయి. కాలేజీలో చదువుకొంటోందిట. ఏదో పెద్దవాళ్ళం. మాకు సాయంగా వుంటుందని ఆ వాటా అద్దెకిచ్చాను నేను."

"ఆపిల్లని చూస్తూనే అనుకున్నానులెండి చదువుకుంటోందని" అంది పార్వతమ్మ అదోలా మొహంపెట్టి.

"అంతా ఒకలాగ వుండరులెండి." అంది సుందరమ్మ.

"మీరు ఆపిల్లతో మాటాడారండి?"

"ఆ"

"మీవరుల్లో మీరుంటారు. ఆవాటాలోకి అస్తమానూ పోరేమో"

"లేదండి. నిన్న ఆదివారం శలవు కదండి. రోజల్లా నాదగ్గరే తిరుగుతూ వుంది. అసలు రోజూ తీరుబడి వున్నప్పుడల్లా మావాటాలోకే వచ్చి మాటాడుతూ వుంటుంది. చాలా చురుగ్గా వుంటుందిలెండి."

"ఆఁ చూస్తూనే తెలుసుకున్నాను నేను"

"ఏమండి మీరు కూడా ఆపిల్లతో మాటాడారా?"

"లేదండి"

"మీరు ఆపిల్ల కుటుంబ విషయాలేమయినా అడిగారా"?

"వాళ్ళది యిక్కడికి కొంచం దూరపు వూరుటండి. పెళ్ళేటూరుట. పెద్ద కుటుంబమట వాళ్ళది. ఆపిల్ల యిక్కడ కాలేజీలో చదువుకొందుకు వచ్చింది. వచ్చిన రోజునే చెప్పింది వాళ్ళపుట్టాలు చాలామందిని గురించి. అన్నీ మరిచిపోయాను. ఏదో సాంప్రదాయమయిన కుటుంబం అని చెప్పింది. అది మనకు చాలు కదండీ"

"ఈకాలంలో ఏమి సాంప్రదాయాలు లెద్దురూ"

"అదేమిటండీ పిన్నిగారూ అల్లాగంటారు" అంది సుందరమ్మ అదోలా మొహంపెట్టి.

"ఆ ఏమీలేదు లెండి"

"నాదగ్గర యేం పోయింది ఫరవాలేదు చెప్పండి" అంటూ సుందరమ్మ కొంచంగా పార్వతమ్మ దగ్గరకు జరిగింది.

"ఏమిటో నేనుకూడా పూర్వకాలం దాన్ని కదండీ. ఏదో వింటాను. నాకు నచ్చకపోతే విస్తుపోతూ వుంటాను"

"ఇప్పుడు ఏంచూచినా వింతగానే కనబడుతూందిలెండి"

"మామూలు మాటలు విని మనం మాత్రం వింతపోతామటండీ"

"ఏమిటో నాకు ఒక్కొక్కప్పుడు అల్లాగే అనిపిస్తూ వుంటుంది—"

"చాల్లెండి మీరు మరీ సత్తెకాలంవాళ్ళు. చూస్తూకూడా ఏమీ గమనించలేరు."

"ఏమిటో మనకెందుకు లెద్దురూ. లోకంలో అనేకరకాలుగా పోతూవుంటారు. మనం వాళ్ళకు దూరంగావుంటే తీరిపోతుంది."

"అయ్యోరాత! ఏమి అమాయకులండీ! ఇంట్లోనే రోజూచూస్తూ యిల్లా మాటాడుతారేమిటండీ" అంటూ సుందరమ్మను ఫూల్ని చేసినట్టు నవ్వు మొఖంపెట్టింది పార్వతమ్మ. సుందరమ్మ కిదేమిటో అర్థంకాలేదు. ఆవిడ మొఖం జేవురించుతోంది. కొంచం కొంచంగా కోపం వస్తున్న ఛాయలు కనబడుతున్నాయి.

"అదేమిటండీ అల్లా చూస్తున్నారు."

"మాయింట్లోనేనా ......"?

"అయ్యో మీవెర్రి బంగారంకాను. మీ మొగుడు పెళ్ళాల గురించి కాదండీ. మీవాటాలో చేరింది క్రొత్తగా అమ్మాయి ...

"ఆ .... ఏమిటీ"?

"ఆపిల్లండీ మీ పక్కగదిలో వున్నపిల్ల అంటూ చెపుతూంటేనే"

"అదేనండి. ఆ అమ్మాయి మిమ్మల్ని ఏమియినా అందా?"

"నన్నెందుకంటుంది. చదువుకోకపోయినా వెర్రిబాగులదాన్ని కానండోయ్. నన్నేమయినా అంటే మొహంవాచేటట్టు చీవాట్లు పెట్టనూ!"

"లేదులెండి. అట్టా అనుకొన్నాను. అమ్మాయి కూడా అందరితోటీ సవ్యంగానే మాటాడుతుంది"

"దెబ్బలాటలు కావండీ"

"మరేమిటి"

"ఆపిల్ల ..... "

"అచ్చు మీ మూడో అమ్మాయిలాగే వుంటుంది కదండీ"

"వూరుకొందురూ. దానికి మాఅమ్మాయికి పోలిక తెచ్చారా. వెధవ విరగబాట్లు యీచదువు కొనేవాళ్ళకి. ఒక్కనాడయినా మాఅమ్మాయి గుమ్మం కదిలిందండీ. పంయిగామొగవాడెవరయినా వస్తే ఎంత పనిలో వున్నప్పటికి నన్ను పిలుస్తారు గాని వాళ్ళు మాటయినా మాటాడరు.

"చదువుకొంటూన్నవాళ్ళు యింతయిదిగా వుండలేరులెండి"

"ఈపిల్ల మరీనండీ"

"ఏమిటో తీరుబడి అయితే ఆపిల్లే మస్తూంది నాదగ్గరకు. నేను ఆపిల్ల వచ్చినప్పటి నుంచీ ఆగది లోకి వెళ్ళడంలేదు"

"అదీ అట్టా చెప్పండి"

"ఏం అల్లా అంటున్నారు"

"ఏమిటో నాకెందుకులెండి లేనిపోని గొడవలు .... "

"చెప్పండి సంగతేమిటో. ఇంతసేపూ నేను మీరేదో మామూలుగా మాట్లాడుతున్నారను కొంటున్నాను. ఇంతగా ఆపిల్లని చూసారను కోలేదు"

మొన్న మారెండోవాడు లేడండీ సూర్యం సినిమా కెడుతున్నాట్ట .... "

"ఊఁ"

"టిక్కెట్టు కొనుక్కొని గేటు దగ్గరికి వెళ్ళబోయాట్ట. మీ పక్కనలేదూఆఅమ్మాయి.

"ఏమిటి మళ్ళీ చెప్పండి"

"ఇంకేముంటుంది. మీయిల్లు అపురూపరంగా అద్దెకిచ్చిన అమ్మాయి ఎవరో యింకో స్టూడెంటుతో .... ఏమిటో వెధవ గొడవలు చెప్పుకుందుకు సిగ్గేస్తుంది కూడాను.

"మాయింట్లో దిగిన అమ్మాయే? పూర్తిగా చెప్పండి"

"ఇంకో పెద్ద మొగాడెవడితోటో పెట్టాపెట్టాలు వేసుకు వస్తోందిటండీ"

"అయ్యో!అయ్యో! చెయ్యాచెయ్యీ పట్టుకునే. ఏంపోయె మండీ యీపూరు టపువే అయ్యో

వప్పటికీ—ఉన్నాళ్ళపట్టి యీవూళ్ళో చదువు కొన్నవాళ్ళని చూస్తున్నాను. కాని యింత విడ్డూరం లేదు సుమండీ''

''అందుకే గదండీ నేనాశ్చర్యపోయి మీకు చెపుతూంట''

''ఏదో స్టూడెంట్లకద్దికిస్తే అల్లరిగా వుంటుంది అయినా ఆడపిల్లగదా కలిసిమెలిసి వుంటుంది అనుకొన్నాను. అంతేగాని యిల్లాంటి పోకిరీసజ్జయితే అద్దెకివ్వనిస్తానండీ''

''నాకెందుకు లెండి నేనన్నానని ఎక్కడా అనకండేం''

''నయం ఎంతమాటన్నారు. మీధర్మమా అని చెప్పేరు. ఎప్పుడు పీడవదిలించు కొంటానోగాని. నేను కనిపెట్టలేకపోయాను సుమండీ''

''మొన్న ఆ అబ్బాయి మీగదిలోకి కూడా వచ్చాట్టండీ''

''ఏమిటే ... మాయింట్లో వుండే యీ భాగోతం''

''రేపు చూడండి. ఆకుర్రాడు వీధిలోంచి వెడుతూంటే నేనుకూడా కళ్ళారా చూశాను.'

''ఒకవేళ దగ్గర బంధువయి వుంటాడండీ అన్నయ్యో తమ్ముడో వచ్చారేమో''

''కాదుటండీ ''హల్లో'' మిస్టరు''అంటూ ఇంకా ఏమి టేమిటో ఆపాడు యింగ్లీషు ముక్కలు నాకు రానేరావు. వాడిమీద వూరికే విరుచుకు పడుతుందిటండీ.''

ఇంతట్లో వీధి అరుగుమీద బూట్లచప్పుడు వినిపించింది. గబుక్కున స్వరం తగ్గించి పార్వతమ్మ అటుచూచింది. అప్పుడే ఆ అమ్మాయి పుస్తకాలు చేతిలో పట్టుకొని నెమ్మదిగా సావిట్లోకి వచ్చింది.

''ఏమండీ పిన్నిగారూ తీరిగ్గా కూర్చున్నారే'' అంటూ శ్యామల పలకరించింది. రోజూ తను గుమ్మంలో అడుగుపెడుతూండగనే సుందరమ్మ గారే పలకరించేది. ఈరోజు ఎందుచేతా ఆవిడ అదోలావుందని ఆలోచిస్తూ సుందరమ్మ పార్వతమ్మల నిద్దర్శిచూస్తూ వుండిపోయింది.

''వస్తానండీ అక్కయ్యగారూ'' అంటూ లేచి వెళ్ళబోయింది పార్వతమ్మ.

''నేనూ కాఫీపెట్టాలి'' అంటూ మొహం ముడుచుకుని లోపలికి వెళ్ళిపోయింది సుందరమ్మ.

ఈరోజు అప్పుడే కాఫీ అంటున్నారేమిటండీ'' అంటున్న శ్యామల మాటలు సుందరమ్మకు విన బడనేలేదు.


* * *

''ఏమండోయ్ చూసారా''

''ఏమిటి ఎప్పుడూ లేనిది యింత క్రొత్తగా ఏమొచ్చింది. కోటయినా విప్పకుండా చెప్ప బోతున్నావు'' అన్నారు సుందరమ్మ గారి భర్త వెంకట్రావుగారు.

''అబ్బానిందురూ. ఏమి చెప్పబోయినా జపంవిడిచి లొట్టల్లో పడ్డారన్నట్టు ఓ పెద్ద వుపన్యాసం యిస్తారు.''

''ఊఁ చెప్పు వినడానికి సిద్ధంగా వున్నాను''



అంటూ దగ్గరగావున్న కుర్చీలాక్కొని కూర్చున్నారు వెంకట్రావుగారు.

''చూసారూ .... ''

''చెప్పు. మధ్యలో చూసార్లూ చేసార్లూ ఎందుకు.

''ఆ నేనేమి మీకోర్టులో ముద్దాయిని గాను సూటిగా చెప్పడానికి అదేమిఖర్మమో మీప్లీడర్లకి కోర్టు—యిల్లు తేడావుండదనుకొంటాను''

''నీయిష్టమొచ్చినట్టు డొంక తిరుగుడుగానే చెప్పు''

''అబ్బా అసలు సంగతి విందురూ''

''చెప్పు మరి. చెవితేగా వినడం''

''అదికాదు గాని ....

''ఏది కాదు?''

''చెప్పనివ్వండీ ఏదో ధోరణిలో చెప్ప బోతూంటే ప్రతి మాటకీ క్రాసుఎగ్జామినా?''

''ఏమయింది?''

''మన పక్క వాటాలో దిగింది శ్యామల ...''

''ప్రీయూనివర్శిటీ చదువుకుంటోంది''

''చదువు గొడవ ఎవరికి కావాలండీ. ఈ కాలంలో అందరూ చదువులు చదివేస్తున్నారు.''

''మరేమిటి?''

''ఆపిల్ల ....''

''అవును. ధాటీగా మాట్లాడుతుందికదూ. బి.యల్. చదివితే మీదకొస్తుంది.''

''చదివిద్దురు గాని లెండి. ఇంట్లోనే వుందిగా''

''ఏం. ఈరోజు ఆపిల్లను గురించి అదోలా మాట్లాడుతున్నావు?''

''అదే చెప్పబోతూంటే వినిపించుకోరు. ఆపిల్ల మంచిది కాదుటండీ! తెలియక వెతికివెతికి మన కొంపలోకి దీన్ని దింపారు''

''నువ్వుమాత్రం అద్దెకు యిమ్మనలేదా?''

''నేనూ యిమ్మన్నాను లెండి. దాని మంచి చెడ్డలు అప్పుడు నాకుమాత్రం ఏం తెలుసు.'

''మరి యిప్పుడెల్లా తెలిసింది''

''మన పక్కింటి పార్వతమ్మగారు లేరండీ. ఆవిడ చెప్పింది నాకు. అయినా యిల్లాంటి సంగతులు ఎన్నాళ్ళు దాగుతాయండీ.

''ఆవిడ చూసిందా''?

''ఆవిడ రెండో అబ్బాయి లేడండీ సూర్యం. అతను కళ్ళారా చూసాట్ట. ఆపిల్లాను మరో అబ్బాయి వెట్టాపట్టా లేసుకొని సినిమాకి వెళ్ళడం''

''అల్లాగా''

''అంతేకాదండీ. ఆకుర్రాడు మనం అద్దెకిచ్చిన వాటాలోకి కూడా మొన్నవచ్చాట్టండీ''

''అయ్యో మన ప్రారబ్ధమండీ. ఇవ్వక ఇవ్వక యీ వెధవ మేళానికిచ్చాం కొంప. మనకి కూడా అప్రదిష్ట—నాలుగు రోజులు పోయాక మన అబ్బాయి శలవులిస్తే వస్తానని వ్రాశాడు కూడాను. వాడికయినా గదిలేక ప్రక్కన యీ భాగోతం ఒకటా''

ఇల్లా కబుర్లు చెప్పుకొంటూండగానే ప్రక్క గదిలోంచి స్పష్టంగా మాటలు వినబడుతున్నాయి.

''శ్యామలా ......''

''ఓయ్ వస్తున్నాను''

''నేను మళ్ళా వస్తాను సాయంత్రం నాలుగు గంటకి. నువ్వు సిద్ధంగా వుంటావు కదూ''

''ఎందుకు?''

''ఇంత మంద మరుపా. యీవేళ కాలేజీలో డ్రామావుంది కదూ''.

''ఉంది .. ''

''ఉంది అంటావేంటి ఎప్పుడారావాలి?''

''ఎందుకు రాను''

అందుకే నాలుగు గంటలకల్లా సిద్ధంగా వుండమన్నాను''

''ఏడు గంటలు దాటాకగదూ డ్రామా''!

''ఓసి అందుకా యీ ప్రశ్నలన్నీ! ఈవేళ అల్లా పార్కుకి వెడదాం. అక్కడ సరదాగా ఓగంటన్నర వుండి కాలేజీవైపు వెడదాం''

''అల్లాగే''

''అయితే వస్తాను. మరిచిపోకు సుమా....''

''టాటా''

''టాటా''

• • •

''వింటున్నారా యిది సంసార్ల కొంపేనాఅంట' తెల్లబోయి చూస్తున్నారు వెంకట్రావు గారు.

''పాడు రోజులు వచ్చాయి. మారోజుల్లో యిల్లాగే వుండేవాళ్ళమటండీ. మూడు ముళ్ళూ వేసినవాడితో నైనా ముగ్గురు పిల్లలు పుట్టే వరకు నలుగురెదురుగా మాట్లాడి ఎరుగుదుమండీ. చాలాసేపు వీధిలో నిలబడితేనే బుగ్గలు నొక్కుకునేది మా పక్కింటి వెంకాయమ్మగారు''

''పోనీలేవే నేనన్నీ భోగట్టా చేస్తాను. నువ్వూరికే అరవకు.''

''అదేమిటండీ అల్లా అంటారు అప్రతిష్ట పెళ్ళీడుకొచ్చిన పిల్ల మరొకరితో సరసాలేమిటండీ అది మన యింట్లోనా?''

''అది కోర్టు ప్రకారం తప్పుకాదులే'' అన్నారు మరేమి సమాధానం చెప్పలేక వెంకట్రావు గారు.

''మీ కోర్టులు చూసే యిప్పటి పిల్లలు ఇల్లా తయారవుతున్నారు. మంచయినాచెడ్డయినా పెద్దవాళ్ళ దగ్గర భయం వుండేది పూర్వం. ఇప్పుడల్లాకాదు. చిన్న పిల్లల దగ్గరనుంచి వాళ్ళు ఏ ఏ పనులు చెయ్యడానికి అధికారం వుందో తప్పుపని చేస్తే ఎల్లా సమర్ధించు కోవాలో తెలుసుకొంటారు''.

పిన్నిగారూ శుభ్రమయిన మంచి నీళ్ళొక చెంబుడిద్దురూ అంటూ యింతట్లో శ్యామల వచ్చేసరికి సుందరమ్మ గొంతుక టక్కున ఆగిపోయింది.

''ఈవేళ మాకాలేజీలో చక్కటి డ్రామా వేస్తున్నారుటండీ. నేను వెడదామను కొంటున్నాను మీరుకూడా వస్తారుటండీ''?

''లేదమ్మా ఒంట్లో బాగాలేదు. నేను రాలేను''

''నేను మధ్యాహ్నమే అనుకొన్నాను మిమ్మల్ని చూసి. ఈవేళ అదోలా మొహం వాడిపోయి నట్టుందేమా అని'' ''వస్తానండీ యింకా డ్రస్సు వేసుకోవాలి''.

''మంచిది ......''

''ఏమిటో యేమీ అర్ధం కావడం లేదు''

''అర్ధమయ్యేదేమిటి. చూసారుకదూ. దీని మొగుణ్ణి చూడ్డానికి నేనుకూడా రావాలిట డ్రామాకి. అరవై యేళ్ళువచ్చాక చదువుకోక మున్ను కొట్టుకుంటూనా అందట వెనకటి ఎవరో వాలానే'' అంటూ సాగదీసుకుంది సుందరమ్మ.

• • •

''ఏరోయ్ రఘూ ఏంటి సినబాచి గాడిపని చాలా హుషారుగా వుందే''

''ఉషారుకాక మరేంటిరా''

''కాని మా గొప్ప సెలక్షనురా''

''మరేమిటనుకున్నావురా నీలాగ ఎంత సేపూ చెదపురుగులాగ పుస్తకంలో దూరి కూర్చోమన్నావా''

''అదికాదురా''

''మరేమిటిరా''

''అంత బరితెగించడంరా''

''బరి తెగించడానికేముందిరా''

''ఓరి దాని తస్సాగొయ్యా. ఎవరయినా దాని పక్కనుంచి వెడితే కన్నెత్తి ఒకసారయినా చూడదురా మరి వీడిలో ఏం చూసిందోగాని తెగ వీరగబడుతుంది వాణ్ణి చూచేసరికి''

''అదేరా లకీ అంటేను''

ఇది చూసే మొన్న మన ప్రసాదు గాడు ''సినిమాకి వస్తావా'' అని అడిగేడుట. మొహం వాచేటట్టు చివాట్లు పెట్టి మెడబట్టి గెంటినంత పని చేసిందట''.

తానుమాత్రం బాచిగాడి పాటి అందగాడు కాడా అనుకున్నాడు కాబోలు

అయినా మన కెందుకు. అదిగో మన మళయాళం యిల్లా వస్తున్నట్టుంది—రా పోదాం. ఆపటాలంమీాద నుంచి వెడితే సరిగ్గా చిత్తయిపోతాం.

• • •

ఏమే సరూ నువ్వెప్పుడు సినిమాకు వెళ్లావే''

లేదు''

'ఏం''

''నాకు టిక్కట్టు కొనిచ్చే సాయం ఎవరున్నారు''?

''ఓహో అల్లాగా''

సుశీ యీవేళ బీచికి వెడదామా''?

నేను రాను''

'ఏమొచ్చిందే నీకు యీవేళ'' పొద్దున్న మేష్టారు చెప్పినవోట్సు వ్రాసు కోవాలి. నేను పొద్దున్న వ్రాసుకోలేదు''.

''నే నిస్తాను లేవే''

''నీ నోట్సు నాకక్కరలేదు''

''ఏం నీకు నానోట్సు తగలేదా''?

''నువ్వు గుండ్రంగా వ్రాయవు''

''మరెవరు రాస్తారు .... పోనీలే నాదగ్గరెందుకు. నీకుకూడా ఏ బాచిగాడేనా నోట్సు యిస్తారేమో తెచ్చుకో''

''ఏమే తెచ్చుకో కూడదా''

''అయ్యో ఎంతమాట. నేనలాగన్నానే''

''ఒసెయ్ విమలా శ్యామల యిక్కడ?

''ఎందుకే నీకు ఫ్రండ్సు కావాలా''?

''కాదే మొన్న లెక్కల లెక్చరరు గారడిగారే''

''అపునే కమలా మొన్న యింటర్వల్‌లో ఫిజిక్సు హెడ్ ఆఫ్ ది డిపార్టుమెంటు కూడా నన్నడిగేరు. నేను కనుక్కొని చెపుతానన్నాను''.

''అసలు ఈ సంగతి అపుడే లెక్చరర్ల వరకూ ఎల్లా వెళ్ళిందే''?

మొన్న డ్రామా జరిగింది కదే ......''

అయితే .......?''

ఇంకేముంది పిచిక సమర్తాడిందనేసరికి మనలవర్సు బయలుదేరుతారుగా. ముందు సీటుల్లో చోటు చాలకపోతే మనజంట ఒక కుర్చీలోనే కూర్చున్నారట. లెక్చరర్లు సగంమంది యీ డ్రామానే చూస్తూ వుండి పోయారట.

• • •

మొన్నాడెందుకో ఫస్టు అవరు గంట కొట్టినప్పటికిన్నీ చాలామంది లెక్చరర్లు ప్రిన్సిపాల్‌గారి గదిలోనే వున్నారు. సాధారణంగా ఎవుడయినా కాలేజీలో అంతగా డిసిప్లనుకు భంగం కలిగితేనే గాని గంట కొట్టాక లెక్చరర్లు ప్రిన్సిపాలుగారి గదిలో వుండరు. క్లాసెస్ జరుగుతున్న టైములో యితర పన్లు చూడ్డం అనేది కొత్తగా చేరిన విద్యార్ధులకి యిదే మొదటి సారిగా కనబడింది.

మేష్టారింకా క్లాసులోకి రాలేదని పిల్లలు మెల్లిగా ఒకరితో వొకరు ఏదో గొణుక్కుంటూ ఉన్నారు. ఇంతట్లో ప్యూను అప్పారావు గబగబా ఆక్లాసు దగ్గరికి వచ్చి ప్రీ యూనివర్శిటీ ఓ. సెక్షను యిదేనా అంటూ ప్రశ్నించాడు. అవునన్నారెవరో. శ్యామలాదేవి ఎవరండీ'' అంటూ టేబులు దగ్గర నిలబడి గట్టిగా అరచేడు ప్యూను. అప్పుడే భాస్కరరావు నోట్సు కాపీ చేస్తున్న శ్యామల తుళుక్కుపడి లేచింది. ప్రక్కనున్న పిల్లలు ఒకరితో వొకరు కనుసైగ చేసుకొంటున్నారు.

''పాకాన్ని పడిందిరోయ్''అన్నారెవరో సన్న గొంతుకతో

''కోర్టుకు పిరుద్ధం'' అంటున్న మరొకంఠం వినబడింది యింకో మూలనుంచి.

''నువ్వుకూడా తైతెక్కలాడుదామను కొంటున్నావా''?అంటూ మొదటి గొంతుకనునొక్కాయి పక్క చేతులు.

• • •

శ్యామల కదేమీ అర్ధం కాలేదు. తనేం తప్పు చేసింది. రోజూ సవ్యంగా క్లాసుకు వస్తోంది. కాలేజీ విడిచి పెట్టగానే యింటికి పోతోంది. సాధారణంగా కాలేజీలో ఆడపిల్లలతో కూడా తానంత పోమకు తిరగదు. హోంవర్కు ఏరోజు కారోజే రెగ్యులర్‌గా చేస్తోంది. మొన్న ఫిజిక్సు మేష్టారు తనెంతో సులువుగా ఏవిషయమైనా అర్ధం చేసుకోగలదని ఎంతో ఎప్రిషియేట్ చేశారు. మరిప్పుడు ప్రిన్సిపాలుగారు తన్నెందుకు పిల్చారు అంటూనే మెల్లిగా ప్యూను వెనకాల ఒకదాని తరువాత ఒకటి చొప్పున లెక్కపెడుతున్నట్టుగా మేడమెట్లు ఎక్కుతూంది. టక్కున ఆగిపోయింది. ఇంకా రెండు మెట్లు వున్నాయనగానే. తన కళ్ళను తనే నమ్మలేక పోయింది.

(మిగతా 63 వ పేజీలో)

# గుసగుసలు

(16 వ పేజీ తరువాయి)

భాస్కర రావుని ప్రిన్సిపాలు ఏదో కోపంగా అడుగుతున్నారు.

"ఏమోయ్ భాస్కరరావు. మీదేవూరు"?

"రామాపురం" అంటూ చేతులు కట్టుకొని వినయంగా చెపుతున్నాడు భాస్కరరావు.

"మీనాన్నగారెవరూ"?

"జానకిరావ్ గారండీ".

"ఎవరూ జానకిరావు గారా"?

"అవునండి"

"డాక్టరు జానకిరావు గారేనా"?

"వూ ....."

"ఆయన కడుపున చెడపుట్టావురా" అనేసారు అప్రయత్నంగా ప్రిన్సిపాలుగారు.

భాస్కరరావు మొహంలో నెత్తురుచుక్కలేదు. ఒంట్లో ఒణుకు బయలు దేరుతోంది. తానా వూరువచ్చి యింకా ఎన్నాళ్ళో అవలేదు. ఈ వచ్చిన కొద్దిరోజుల్లోనూ తన ప్రవర్తనలోఎట్టి మార్పు అతడు గుర్తించలేదు. మరి ప్రిన్సిపా లెందుకు ఇంతమాటన్నారు. భాస్కరరావుకి ఎక్కడ లేని కోపం వచ్చింది. ఏమిటో గొణుక్కొన్నాడు. కాని తానింకా పైకి రావలసినవాడు. పైగా ప్రిన్సిపాలుగారు తన తండ్రిని బాగా ఎరుగున్న వారిలాగున్నారు. అని నాలుక కరుచుకొని నిలబడ్డాడు భాస్కరరావు.

"నీవు వచ్చి యింకా ఎట్టుమని పది రోజులు కాలేదు. మాకాలేజీకి ఎప్పుడూ లేని అప్రతిష్ట తెస్తావు".

భాస్కరరావు కిదేమీ అర్థం కావడం లేదు. అయినా యింకా ఓపిక పట్టలేక.

"నేనేం తప్పు చేసాను మేష్టారూ. చెప్తితే దిద్దుకుంటాను"

"నీ గురించి నలుగురూ ఏమి చెప్పు కొంటు న్నారో నీకు తెలియదా?"

"తెలీదు" ముక్తసరిగా చెప్పాడు భాస్కర రావు.

"తెలీదు"?

"వూ"

"కాలేజీలో నీతో చదువుకొంటున్న అమ్మా యిలందరి పెళ్ళాళ్ళ లాంటివాళ్ళు కారా?"

భాస్కరం గుండె గతుక్కుమంది. మొహం పాలిపోతోంది. తానెప్పుడూ కన్నెత్తి అయినా తన క్లాసు పిల్లల్ని చూడలేదు. తనకు సరిగ్గా వాళ్ళ పేర్లయినా తెలియవు. అయితే తన క్లాసు అమ్మా యిలు ఎవరయినా తనపై రిపోర్టు చేసారా? అయితే ఎవరు? ఎందుకు?

"నేనెవర్ని ఏమీ అనలేదు మేష్టారూ"

"ఎవరితో మాటాడుతున్నావో తెలుసా. పైకి రావలసినవాడివి. అనవసరంగా చెడిపోకు జాగ్రత్త" అంటూ గద్దించారు ప్రిన్సిపాల్‌గారు.

"సరే యితన్ని పంపెయ్యండి" అంటూ లెక్చరరు గారు భాస్కరాన్ని పంపేసారు.

శ్యామలని లోపల ప్రవేశపెట్టాడు బంట్రోతు అప్పారావు. ఇంతకూ భాస్కరరావుని ప్రిన్సిపాలు గారు గుడ్లెర్రజేసి ఎన్నో ప్రశ్నలు వేసారు. ఎన్నో జవాబులు రాబట్టారు. చివరకు కసురుకొంటూ పంపించేసారు అదేమీ తనకు పాలు పోలేదు. ఇంక తన్నేమడుగుతారో అని భయంగా నిలబడింది ప్రిన్సిపాలుగారి టేబులుకు దూరంగా నేల చూస్తూ.

"నీ యడ్రసు చెప్పు శ్యామలా"! అన్నారు ప్రిన్సిపాలుగారు ఏమిటో అసహ్యించు కొంటు న్నట్టుగా మొహంపెట్టి.

మెల్లిగా గుణుకుతున్నట్టుగా యడ్రసు చెప్పింది శ్యామల.

"నువ్వు సుబ్బారావు రెండో కూతురువా" అంటూ ఆశ్చర్యపోతూ "ఇదేమిటి నా ఫ్రండ్సు అందరూ ఎంత పెద్ద కుటుంబాల్లో పుట్టి పెరిగి పేరు గడించారో వీళ్ళ పిల్లలు అంత తుంటర్లుగా తయారవుతున్నారు—అంటూ బాధగా అన్నారు ప్రిన్సిపాలుగారు.

"ఇంక నువ్వు పో"

శారద వెనక్కి తిరిగింది. బాధగా ఆమెకళ్ళ నుండి రెండు అశ్రువులు రాలాయి. ఇదోనటన కాబోలు అన్నట్టు చీదరింపుగా అటుప్రక్క ఓ సారి చూసారు ప్రిన్సిపాలుగారు.

ఆరోజుకప్పుడేనాలుగు రోజులయింది భాస్కర రావు శ్యామలకాలేజికి వెళ్ళి. శ్యామల, భాస్కరరావు జానకిరామయ్యగారు, సుబ్బారావు గారు నలుగురూ ఒకేజట్కాలో దిగారు. అప్పుడే ఆఫీసులోకి పాబో తూన్న ప్రిన్సిపాలుగారు తన పాత మిత్రులను చూచి మేడమీదనుంచే నమస్కారాలతో పలకరించారు. కాని వాళ్ళు నలుగురు కలిసిరావడం చూస్తే అదోలా లని పించింది ప్రిన్సిపాలు గారికి.

ఫ్రండ్సు అందరూ కుర్చీల్లో కూర్చున్నారు. ఒక్కరి మొహంలోనూ ఆనందరేఖలు చూద్దామని కయినా లేవు. జానకిరావు గారికికానీ, సుబ్బారావు గారికికానీ ప్రిన్సిపాలు తమ నెందుకు పిలిపించారో అర్థం కావడంలేదు. ఇంటి దగ్గర వాళ్ళ పిల్లల్ని చూస్తే ఏదో పెద్ద నేరంచేసి ఛడామడా తిట్లు తిన్నట్టు కనబడుతున్నారు.

ఫ్రండ్సు.... మిమ్మల్ని నేను శ్రమ పెట్టా ననుకుంటాను అంటూ ప్రిన్సిపాలుగారె ప్రసంగం ఎత్తాక స్నేహితుల్లో కొంచం కలవరం కలిగింది.

"ఏం నారాయణరావ్ మా పిల్లల చదువు విషయమయినా మమ్మల్ని పిలిపిస్తే" జానకిరాంగారు ప్రశ్నించారు.

"అవును". ముక్తసరిగా జవాబు చెప్పారు ప్రిన్సిపాలుగారు.

"ఏమిటి అసలు గొడవ" అంటూ ఇద్దరూ ఒకేసారి అడిగారు పిల్లల పైపు ప్రిన్సిపాలు గారి వైపు చూస్తూ.

"వాళ్ళ కేరక్టర్ల గురించి మీరు తగిన జాగ్రత్త తీసుకోవాలి"

ఇంట్లో జాగ్రత్తగానే వుంటారంటే యిష్టట్టు మొహం పెట్టారు మిత్రులిద్దరున్నూ.

"పిల్లలు ఇంట్లో వున్నట్టుగా వీధిలో ఉండరు ఇది అనుభవం మీదకాని తెలీదు. నాపని ఎప్పుడు పిల్లలతో కలిసి మెలిసి ఉండడమే కనక తెలుసు. అంచేత మీరిక్కడినుంచయినా జాగ్రత్త పడాలి. కాలేజీ అంతా వీళ్ళ పేర్లతోనే మోగిపోతూంది. వూళ్ళో పెద్ద మనుష్యులవరకు పోయింది. చూడండి" అంటూ అవూరి పెద్ద ప్లీడరు వెంకట్రావ్‌గారు శ్యామల గురించి కనుక్కొని కాలేజీ డిసిప్లినుతోపాటు ఈ పిల్లల్ని కన్నతల్లిదండ్రుల పరువు ప్రతిష్టలు కాపాడమని వ్రాసిన వుత్తరం వాళ్ళముందు పడేసారు.

"వీళ్ళు ఎవళ్ళతో నయినా తిరుగుతున్నా రంటారా" అన్నారు భాస్కరరావు తండ్రి సుబ్బా రావుగారి వైపు శ్యామలవైపు అదోలా చూస్తూ.

"కాదు వీళ్ళు మరెవరితోటి అయినా తిరిగితే నేను మీకు వుత్తరం వ్రాసే వుండకపోదును మీమర్యాదలు కూడా అప్పుడే మంట గలిసి వుండేవి. వీళ్ళని నేను కాలేజీలోంచి గెంటి వుండే వాణ్ణి. మీస్నేహితుల పూర్వజన్మ సుకృతంవల్ల వీళ్ళు పైవాళ్ళతో తిరక్క వీళ్ళిద్దరే అపసవ్యంగా ప్రవర్తిస్తున్నారు" అన్నారు ప్రిన్సిపాలుగారు.

"శ్యామలా భాస్కరరావు కలిసి తిరుగుతున్నా రంటారా" అని నొక్కి అడిగేరు సుబ్బారావుగారు జానకిరాంగారి వైపు చిరునవ్వుతో చూస్తూ.

"అవును వీళ్ళిద్దరేను. అందుకే వుత్తరంలో వ్రాయడం నాకిష్టంలేక ఇకనయినా జాగ్రత్తపడ తారని ఇక్కడికి రమ్మని వ్రాశాను" అన్నారు ప్రిన్సిపాలుగారు.

జానకిరాంగారు సుబ్బారావు గారు ఒకరిమీద ఒకరుపడి అదేనవ్వు లంకించుకున్నారు. వాళ్ళకి నవ్వు ఎంతకీఆగడంలేదు. ప్రిన్సిపాలు స్నేహితుడే అయినప్పటికిన్నీ చుట్టూ కూర్చున్న లెక్చరర్లు ఏమి అనుకుంటారో అని నవ్వు ఆపుకోప్రయ త్నిస్తున్నారు. కాని పావుగంటవరకు నవ్వడమే తప్ప మాటలాడలేక పోయారు. శ్యామల భాస్కరరావుల మొఖాల్లో వికాసం వెల్లివిరిసింది. వాళ్ళిద్దరూ ఒకర్ని చూచి ఒకరు చిరునవ్వులు నవ్వుకున్నారు. ఇద్దరూ కలిసి ప్రిన్సిపాలేమనుకొంటారో అని ఆయనవైపు చూచి చిరునవ్వుతోనే ఆగిపోయారు విజయం సాధించినట్లు.

ప్రిన్సిపాలుగారికి ఇతర లెక్చరర్లకి వీళ్ళ నవ్వు అర్థం కాలేదు.... తరువాత నవ్వుదురుగాని అసలు సంగతి చెప్పండి" అంటూ కొంచం చిరాకుగానే అన్నారు ప్రిన్సిపాలుగారు.

మొన్న శలవుల్లో నీవు కుటుంబంతో మీ బంధువు లెవరింటికో వెళ్ళావుట. నీవుస్థిరంగా ఏవూళ్ళో వుండేదీ ఎవరూ చెప్పలేమన్నారు. అందుచేత నీకు శుభలేఖ వ్రాయలేక పోయాము.

(మిగతా ప్రక్క పేజీలో)

(ప్రక్క పేజీ తరువాయి)

అది మా తప్పేను. మాసంగతి తెలుసున్న వాడివి నువ్వేమీ అనుకోకు. వీళ్ళకి మొన్న వేసంగి శలవుల్లోనే పెళ్ళి చేశాము. శోభనంకూడా చేశాము. అందు చేతనే నిశ్చింతగా యీవూరు వదువుకు పంపించాం'' అంటూ నవ్వుమళ్ళీ అందుకున్నారు. అదివిని వున్నవాళ్ళందరూ నవ్వక వుండలేకపోయారు. ప్రిన్సిపాలు తాను పొరబడ్డాననుకున్నాప్పటికి తన డ్యూటీయే తాను చేశాననే తృప్తితో నవ్వు కలిపేసాడు.

అమర్నాడు సుందరమ్మగారు పార్వతమ్మగారు శ్యామలని పిలిచి మళ్ళీ ఆప్యాయంగా మాట్లాడడము ప్రారంభించారు.. వాళ్ళు మాట్లాడుతుంటుండగానే ''శ్యామలా అంటూ ప్రక్కగదిలోంచి కేక వినపడింది. ''ఈ వేళ మీరుకూడా సినిమాకు రావాలండీ'' అంటూ బలవంతపెట్టివది. శ్యామల సుందరమ్మ పార్వతమ్మ గార్లని''. అల్లాగేనమ్మా నువ్వు వెళ్ళేటప్పుడు మరోసారి పిలు'' అన్నారు పార్వతమ్మగారు. ''అబ్బాయినికసారి యిల్లారమ్మనమ్మా నేను చూస్తాను' అంది సుందరమ్మ. పెద్దగదులు దొరక్క శ్యామల ఒకచోట, భాస్కరరావు ప్రఫుల్లుదగ్గర వుంటున్నారేకాని వాళ్ళిద్దరూ నూతన దంపతులన్న సంగతి గ్రహించలేక పోయామని ఒకరిమొహం ఒకరుచూచి నవ్వుకొన్నారు. తమ అవివేకానికి సుందరమ్మ పార్వతమ్మ గార్లు.

★

# అనుబంధాలు

[13 వ పేజీ తరువాయి]

కాస్సేపు తరువాత ''అరెబాబూ! ఇక్కడనీ కొక పుట్టుమచ్చ వుండాలే.. ఏమయింది..'' నోటి దగ్గర తడుముతూ ప్రశ్నించాడు..

ఆయన ప్రశ్నకు అన్నం తింటున్న వాడల్లా అదిరి పడ్డారు వీరభద్రం..నవ్వున జవాబివ్వలేక.. ''ఓ..అదా.. నా..న్నా..'' తడబడ్డాడు.. అతడి అవస్థకు ఫక్కున నవ్వుకొని ఆయన భార్య..

''అదా మావయ్యా! ఒకరోజు గడ్డం చేసుకొంటూంటే సరిగ్గా అక్కడే తెగింది.. అశ్రద్ధ మూలంగా సెప్టిక్ అయింది... తరువాత ఆపరేషన్ చేసుకోవాల్సి వచ్చింది..

అప్పుడు మచ్చ పోయింది. అదేగాయం కూడా కనిపించదల్లే!'' అర్ధాంగి సర్దిపుచ్చింది.. ఆమె యుక్తి యుక్తానికి విస్తుపోయాడువీరభద్రం..

''బతుకు జీవుడా!'' అనిమనసులో అనుకొని దీర్ఘంగా శ్వాసవిడిచాడు..ఆపద తీరిందనుకునేంతలో,

''అబ్బాయ్.! పెద్దాడివయ్యేసరికి అలవాట్లన్నీ మార్చుకున్నట్లున్నావే.. అప్పుడు నువ్వు ప్రతి పనికీ ఎడం చెయ్యి వుపయోగించే వాడివి.'' తఫీమని ప్రశ్నించాడు.

''అది నాన్నా!మిలిటరీలోఎడంచేయి వుపయోగించనియ్యరు. క్రమంగా కుడిచేయి అలవాటు చేసుకున్నాను. ''

ముసలాయనకు తెలీదు గనుక.. 'కామోసు!' అనుకున్నాడు.

అప్పటికే సరిగ్గా రాత్రి పదకొండు గంటలయింది. ద్రాక్షరసం ఓచుక్క ఎక్కువ పడిందేమో కొద్దిగా తూలసాగాడు ముసలాయన!

భోజనం దగ్గర్నించి లేచారు.

పడక దగ్గరకు చేరాడు ముసలాయన..

'ఓహ్! ఇన్నాళ్ళకు నాపుత్రుణ్ణిచూడగలిగాను. అంటూ కావలించుకొన్నాడు. క్రమంగా, నిశ్చింతంగా నిద్రాదేవి ఒడిలో ఎనలేని తృప్తితో ఒరిగి పోయాడు. ఆయన నుండి దృష్టి మరల్చి, లైటార్పేసి, మెల్లగా బరువెక్కిన హృదయంతో తన గదిలోకి వెళ్ళి పోయాడు కెప్టెను వీరభద్రం.

గదిలో కిటికీ దగ్గర నిలబడి, ఆ చిరు చీకటిలో ప్రకృతిలోకి దృష్టి సారించి, సిగరెట్టు పొగలు వదుల్తూ ''ఏమిటి ఈవిడదీయరాని బంధం.. వివరించలేని అనుబంధాలు'' ఎదురుగా నిర్మలాకాశం.. వింత కాంతులతో ప్రజ్వలించే అందాల తారలు ఆకాశాన్ని ఆవరించాయి.

ఎదురుగా గుడ్డి వెలుగులో వృద్ధ వృక్షం, ఆకులు రాలిపోగా, మోడువారి ఒంటరిగా దుష్ప్రి కొమ్మల్లాగా నిలిచి వుంది. ప్రక్కనే కలకలలాడే ఓచిన్నారిలత ఆవృక్షపు మొదలుకు అల్లుక పోయి వుంది.

గట్టిగా శ్వాసవిడిచి..''ఏమిటో ఈవిడదీయరాని అనుబంధం..'' అప్రయత్నంగా అన్నాడు ఆమాటలు,అతడు విడిచిన దీర్ఘ నిశ్వాసంతో, విడిచిన సిగిరెట్టు పొగల అలల్లో కలిసి పోయింది.

★

# కృష్ణవేణి

[52 వ పేజీ తరువాయి]

''స్వయంగావెళ్లి మాట్లాడాల్సిన సంగతి కాబట్టి వెళ్లివచ్చాను. ఈమాత్రానికి మీకేం లోటు వచ్చింది? అన్నీ గోపీతో .... ''

అరుణా! నన్నింకా రెచ్చగొట్టకు. చేసింది చాలక సమర్ధించుకోబోతావేం? మహా లోటు లేకుండా అమర్చివెళ్లావ్. టిఫిన్లకీ — కాఫీలకీ మొహంవాచి వచ్చాననుకున్నావా?ఎందుకొచ్చాను? ఎవరికోసం వచ్చాను? కావలసినదేమిటో గోపీ చూస్తే నిండిపోతుందనుకున్నావా? అసలు నేను వచ్చానని నీకేమైనా సంతోషంగా వుందా?''

అరుణ జవాబేమీ చెప్పకుండా టిఫిన్ప్లేటు తీసుకొచ్చి ముందిడి ''తినండి చల్లారిపోతుంది'' అంది.

''చాల్లే మమకారం. ఇంకా ఫలహారమెందుకు? నీఅనురాగంతోనే కడుపంతా నిండి' వుంది.'' అంటూ ప్లేటు తోసివేశాను.

ఓక్షణం ఆగి— మీకింత కోపం వస్తుందని అనుకోలేదు.'' అంది నెమ్మదిగా.

''కోపం కాదు అరుణా! కోపమైనా కొంత సేపటికి పోతుంది. గుండెల్లో పేరుకొంటున్న బాధ ఏనాటికీ కరగదు. ఒకప్పుడు నిన్ను తల్చుకుని ఎంతో మురిసిపోయాను. నా మురిపెం అంతా ముక్కలైపోయింది. నేను కోరుకొంటూన్న దాంపత్య జీవితాన్నే పొందలేకపోతున్నాను. జీవితానికి ఆలోటు చాలు—నువ్వు ఆర్డర్ చేసి వెళ్లే టిఫిన్లూ,కాఫీలూ కాదు నాకు కావల్సింది. నామనసు సంతోషపెట్టాలని నీకెందుకు తోచదో నాకర్ధం కాదు.'' అనుకోకుండానే ఆనాలుగు ముక్కలూ వెళ్లడించాను శాంతంగా.

—(సశేషం)

# కవితా చిత్ర

కవితా చిత్ర అనే నూతన ఫిలిం కంపెనీ ఒకటి ఒక బెంగాలీ నవల ఆధారంగా సాంఘిక చిత్రాన్నొకదానిని నిర్మించబోతున్నది. దీనినిర్మాతలు శ్రీ కె.సత్యనారాయణ, డి.శ్రీరామమూర్తి. మాటలు: ఆచార్య ఆత్రేయ వ్రాస్తున్నారు. దర్శకత్వాన్నికూడా శ్రీ ఆత్రేయ నిర్వహించుతారు. పాటలను శ్రీ నార్ల చిరంజీవి, శ్రీశ్రీ వ్రాస్తున్నారు. కళ: శ్రీ గోఖలే. సంగీతం: శ్రీ పెండ్యాల నాగేశ్వరరావు. చిత్ర నిర్మాణ నిర్వహణ శ్రీ కె. కోటేశ్వరరావు.

శ్రీ అక్కినేని నాగేశ్వరరావు, కృష్ణ కుమారి నాయకా నాయక పాత్రలకు ఎన్నుకోబడినారు. ఇతర ముఖ్యపాత్రలను గుమ్మడి, రేలంగి, రమణాచలం, పద్మనాభం, గిరిజ, సూర్యకాంతం, నిర్వహించుతారు. ఈ కంపెనీవారు దీపావళినాడు అరుణాచలం స్టూడియోలో ఒకపాటను రికార్డు చేశారు. ప్లేబ్యాక్ గాయనులు సుశీల, జానకి, సరోజిని ఈ పాటను పాడారు.

ఈ ప్రారంభోత్సవానికి అన్నపూర్ణా పిక్చర్సు నిర్మాత శ్రీ మధుసూదనరావు, శ్రీ అక్కినేని నాగేశ్వరరావు, శ్రీమతి కృష్ణ కుమారి, శ్రీ గుమ్మడి వెంకటేశ్వరరావు, శ్రీ రేలంగి వెంకట్రామయ్య, శ్రీ రమణాచలం, శ్రీ పద్మనాభం, శ్రీశ్రీ, శ్రీ నార్ల చిరంజీవి మున్నగు ప్రముఖులు పలువురు వచ్చారు.

★

Printed and Published by S. V. Swami, B.A., at The Andhra Prabha Press, Gandhinagar, VIJAYAWADA-2.
Editor: Neelamraju Venkata Seshaiah.